## వడ్లు వర్షార్పణం

రామారెడ్డి, అక్టోబర్ 29: అకాల వర్షాలు అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టక పోవడంతో రైతుల కష్టాలు రెట్టింపయ్యాయి. కాంటాలు వేయక పోవడంతో ఉమ్మడి జిల్లాలో ధాన్యం రాసులు రోడ్లు, కల్లాల్లోనే పేరుకు పోయాయి. అయితే, మంగళవారం రామారెడ్డి తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో వడ్లు తడిసి పోయాయి. కుప్పల్లోంచి వరదనీరు ప్రవహించడంతో ధాన్యం కొట్టుకుపోయింది. పంటను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడ్డా ఫలితం లేకపోయింది. తడిసిన వడ్లను చూసి కన్నీటి పర్యంతమైన కర్షకులు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. పంట కోసి, ఆరబెట్టి 20 రోజులైనా కాంటాలు వేయక పోవడం వల్లే తమకీ దుస్థితి తలెత్తిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.


రామారెడ్డిలో కుప్పల్లోకి చేరిన వర్షపు నీటి నుంచి ధాన్యాన్ని వేరు చేస్తున్న రైతులు

### కొనుగోళ్లపై అంతులేని తాత్సారం

కామారెడ్డి జిల్లాలో 420 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. సన్నాల సేకరణ లక్ష్యం రెండు లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 4.80లక్షల మెట్రిక్ టన్నులు ఉండొచ్చని అంచనాలున్నాయి. కానీ ఇంతవరకూ ధాన్యం బస్తాలు ఎత్తిందీ లేదు. రైతుల నుంచి సేకరించిందీ కనిపించడంలేదు. నిజామాబాద్ జిల్లాలో ఈ వానకాలంలో 12లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందని అంచనా వేశారు. 2లక్షల మెట్రిక్ టన్నులు బహిరంగ మార్కెట్లో వ్యాపారులు సేకరించగా, మరో 2లక్షల మెట్రిక్ టన్నులు రైతులు తమ అవసరాల కోసం నిల్వ చేసుకుంటున్నారు. మిగిలిన 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. 480 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహం చేసి ప్రారంభిస్తున్నారు. సన్న వడ్లను కొలిచేందుకు క్యాలిపర్లను సైతం సిద్ధం చేసుకుంటున్నారు. కానీ సేకరణలో నెలకొన్న జాప్యం అనేక అనుమానాలకు తావిస్తున్నది. కొనుగోళ్లపై తాత్సారం చేస్తుండడంతో విసుగుచెందిన రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతులే స్వచ్ఛందంగా వ్యాపారుల వద్దకు వెళ్లాల్సినంత అవసరాన్ని సర్కారు నిర్లక్ష్యం ఉసిగొల్పుతున్నది. అధికారంలోకి వస్తే క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో ఇదే విషయాన్ని పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. ఇచ్చిన మాట నెరవేర్చాలంటే భారీగా నిధులు సమకూర్చుకోవాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నమే చేయడంలేదు. దీంతో ఎగవేతలో భాగంగానే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రోడ్లపైనే వడ్లు

## కల్లాలు దాటని ధాన్యం

- రహదారులపైనే లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యపు రాశులు
- కొనుగోళ్లపై సర్కారు నిర్లక్ష్యం
- నామమాత్రంగా కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- కాంటా వేసింది లేదు.. గింజ కొన్నదీ లేదు

*వానకాలం వడ్లు కాంటా పడడం లేదు. కల్లాలు దాటడం లేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి మాత్రమే పరిమితమయ్యాయి. వడ్ల సేకరణ మొదలు కాకపోవడంతో ఏ రోడ్డు మీద చూసినా ధాన్యం రాశులే దర్శనమిస్తున్నాయి. పుట్ల కొద్దీ వడ్లతో రహదారులన్నీ నిండిపోయాయి. పదిహేను రోజుల నుంచి కల్లాలు, రోడ్లపైనే ధాన్యం కుప్పలు ఉంటున్నా..సేకరణ ప్రక్రియపై సర్కారు నుంచి స్పష్టత కరువైంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు పడిగాపులతోపాటు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో చేతలకు పొంతనలేకుండా పోయిందంటూ రైతాంగం అసహనం వ్యక్తం చేస్తున్నది.*

*–నిజామాబాద్, అక్టోబర్ 29, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

ప్రతిరోజూ వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు మార్కెట్‌కు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలకు పుట్లకొద్దీ ధాన్యం తరలిస్తున్నా..కొనేవారు కరువయ్యారు. దళారులు, వ్యాపారులను మినహాయిస్తే .. ప్రభుత్వ కొనుగోలు కేంద్రా ల్లో సేకరణపై ఎలాంటి స్పష్టత లేకుండాపోయింది. ధాన్యం కుప్పలను అకాల వర్షాలకు తడవకుండా చూసుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఏ వాన వచ్చి నష్టాన్ని తీసుకు వస్తుందో అన్న భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. వందలాది కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలో యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. 18లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడులు వస్తాయని అంచనా వేసింది. కానీ ఇంతవరకూ కొనుగోళ్ల ప్రక్రియంలో వేగం పుంజుకోకపోవడం గమనార్హం. సర్కారు నిర్లక్ష్యం మూలంగా రైతులు ఎదురుచూపులకు చెక్ పెట్టి దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఎంతో కొంతకు ముట్టజెప్పి అదే పదివేలు అన్నట్లుగా స్వల్ప గిట్టుబాటుతోనే మిన్నకుండిపోతున్నారు.

### దోచుకుంటున్న దళారులు

అకాల వర్షానికి పంటను నష్ట పోయే బదులు ప్రైవేటుకు అమ్ముకోవచ్చనే ఆలోచనతో చాలా మంది రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు ఇదే అదనుగా కల్లాలు, రోడ్లపై వాలుతున్నారు. సన్నరకం వడ్లను కూడా రూ.2వేల వరకే చెల్లించి రైతులకు నష్టం చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, బి గ్రేడ్ రకానికి రూ.2300 చొప్పున దక్కుతుండగా.. దళారులు మాత్రం తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తున్నారు. రేవంత్ సర్కారు ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు అదనంగా రూ.500 అందాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభిస్తున్నా.. గింజ మాత్రం కొనడం లేదు. ఒక రైతు తన పొలంలో పంట కోయగానే టోకెన్ పొంది వరుస క్రమంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు సిద్ధం అవుతాడు. ఇదీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రక్రియ. టోకెన్ సిస్టంతో ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. పైరవీలకు ఆస్కారం ఉండదు. కానిప్పుడు టోకెన్ సిస్టమే కనిపించడం లేదు. నిజామాబాద్ జిల్లాలో దాదాపుగా లక్షా 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పోగై ఉన్నట్లుగా తెలుస్తోంది. కామారెడ్డిలోనూ లక్షా మెట్రిక్ టన్నులు ధాన్యం రోడ్లపైనే పరుచుకున్నట్లు సమాచారం.

### తూతూ మంత్రంగా ప్రారంభించిండ్రు



మాకు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. పండించిన పంటను అమ్ముదామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కొన్ని గ్రామాల్లో ఏదో తూతూ మంత్రంగా కేంద్రాలను ఏర్పాటు చేసినా..వడ్లను కొనడం లేదు. వడ్లు కేంద్రాల్లో రోజుల తరబడి ఉండడంతో దళారులకు అమ్మినం. సరైన ధర రాక మేము నష్టపోయినం.

**-మామిళ్ల శ్రీనివాస్, రైతు, చందూర్**

### దళారులకు అమ్మి నష్టపోయినం..



నాకున్న రెండెకరాల్లో పండించిన పంటను అమ్ముదామంటే ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు పొలాల వద్దకే వస్తున్నారు. కోసిన వరి పంటను ఎండ పెట్టలేక, వాతావరణం సహకరించక పోవడంతో తక్కువ ధరకే ధాన్యం అమ్మి నష్టపోయినం.

**- బర్ల పోశెట్టి, చందూర్**

### పంటంతా నేలపాలయ్యింది..



అకాల వర్షాలతో పంటంతా నేల పాలయ్యింది. మిగిలిన వరి గింజలను కోసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముదామంటే వాటిని ఇంకా ప్రారంభించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తడిసిన ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర ఇచ్చిండ్రు. ఇప్పుడు కూడా ఇవ్వాలి.

**-కోటగిరి రాములు, లక్ష్మాపూర్ గ్రామం, చందూరు మండలం**


నిజామాబాద్ నుంచి ఆర్మూర్‌కు వెళ్లే రహదారి పక్కన ఆరబోసిన ధాన్యం


బోర్గాం నుంచి మాక్లూర్ వెళ్లే రోడ్డులో టార్పాలిన్లతో కప్పి ఉంచిన ధాన్యం రాశులు

## రైతాంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం

### అన్నదాతల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పాలన: బీఆర్ఎస్ నాయకులు

రుద్రూర్, అక్టోబర్ 29: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన.. రైతుల పాలిట శాపంగా మారిందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వర్ని మండల కేంద్రంలో నియోజకవర్గ నాయకులతో కలిసి మంగళవారం 'రైతు నిరసన' చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలేదని మండిపడ్డారు. రైతు భరోసా, వరికి బోనస్‌ను తుంగలోకి తొక్కిందన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఇప్పటివరకు ధాన్యాన్ని సేకరించడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన వెంటనే ధాన్యం సేకరణ ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. రూ. 2 లక్షల రుణమాఫీపై రైతులకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, మండల నాయకులు మధు, మాధవరెడ్డి, నర్సింహులు, అఫ్రోజ్, సాయిలు, ప్రవీణ్‌యాదవ్, రాము, సాయికిరణ్, పోచయ్య, పుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



వర్నిలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

- అన్ని అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వెల్లడి
- నిజామాబాద్‌లో కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ
- బహిరంగ విచారణకు 120 వినతులు

# కుల గణనకు సమగ్ర సర్వేనే ఆధారం

**బీసీలు పూర్తి వివరాలు వెల్లడించాలి**

కంఠేశ్వర్/ఖలీల్‌వాడి, అక్టోబర్ 29: ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి సర్వేనే కుల గణనకు ఆధారమని అందువల్ల బీసీలు పూర్తి సహకారమందించి వివరాలు సమర్పించాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సూచించారు. ఈ సర్వేలో ఆస్తుల వివరాలు తెలుసుకోవడమనేది మీ నుంచి తీసుకెళ్లడం కోసం కాదని, బీసీల స్థితిగతులను తెలుసుకోవడం కోసమేనన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలతో పాటు ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర సర్వే సందర్భంగా వెల్లడయ్యే అంశాలను పరిగణనలోకి తీసుకుని స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషాపై సమగ్ర నివేదిక రూపొందిస్తామన్నారు. స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్న కమిషన్ మంగళవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో ప్రజలు, పార్టీలు, కుల సంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించింది. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాల లక్ష్మితో కూడిన కమిషన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి 120 వినతులు, సూచనలు వచ్చాయి. విచారణ అనంతరం కమిషన్ చైర్మన్ నిరంజన్ విలేకరులతో మాట్లాడారు. బీసీ కమిషన్ నిక్కచ్చిగా పని చేస్తుందని, కచ్చితమైన సమాచారమిస్తే బీసీలు హక్కులు సాధించుకోవడానికి సహకరిస్తుందన్నారు. నవంబర్ 13 వరకు ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలను పోస్టల్ ద్వారా కమిషన్‌కు తెలుపవచ్చన్నారు.


మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, చిత్రంలో కమిషన్ సభ్యులు, కలెక్టర్

**120 వినతులు..**

బీసీ కమిషన్‌కు భారీగా వినతులు వచ్చాయి. నిజామాబాద్ రూరల్, జుక్కల్ ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, లక్ష్మీకాంతరావు తమ అభిప్రాయాలను కమిషన్ ఎదుట ఉంచారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరగాలని వారు పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయించాలని విన్నవించారు. జిల్లాలో బీసీ భవన్ నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రెండెకరాల స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించాలని జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు కోరారు. సమగ్ర కులగణన అనంతరం కులాల జనాభా లెక్కలు బహిరంగపర్చాలని కోరగా, బీసీ లెక్కలు తేలేలా సంఘం తరఫున గ్రామ గ్రామాన చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కమిషన్ చైర్మన్ నిరంజన్ సూచించారు. వివిధ పార్టీలు, బీసీ కుల సంఘాల నుంచి కలిపి మొత్తం 120 వినతులు వచ్చాయి. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, స్పెషల్ ఆఫీసర్ సతీశ్, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి స్రవంతి పాల్గొన్నారు.

### బురుడుగల్లీలో కమిషన్ పర్యటన


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బీసీ కమిషన్ బృందం

కంఠేశ్వర్, అక్టోబర్ 29: నగరంలోని బురుడుగల్లీలో సోమవారం రాత్రి పర్యటించిన బీసీ కమిషన్.. మేదరి కులస్తుల జీవన స్థితిగతులను పరిశీలించింది. మేదరుల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై కమిషన్ సభ్యులు వారిని అడిగి తెలుసుకున్నారు. వెదురుతో తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఇతర రాష్ట్రాల తరహాలో తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని మేదరి కులస్తులు విన్నవించగా, సానుకూలంగా స్పందించిన కమిషన్ ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చింది.

- హాజరైన త్రిసభ్య కమిటీ సభ్యులు
- ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

## బాబ్లీ గేట్ల మూసివేత

మోర్తాడ్, అక్టోబర్ 29: ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను త్రిసభ్య కమిటీ పర్యవేక్షణలో మంగళవారం మూసివేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతిఏటా జూలై 1న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి, అక్టోబర్ 29న మూసివేయాలి. ఇందులోభాగంగా ప్రాజెక్టు 14 గేట్లను మూసివేశారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ రావుగుప్తా, సీఆర్ బన్సోడ్ ఈఈ నాందేడ్, ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి, డీఈఈ గణేశ్, ఏఈఈ రవి, ఎస్‌డీఈ (సీడబ్ల్యూసీ) సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఎస్సారెస్పీకి తగ్గిన వరద**

బాబ్లీ గేట్లు మూసివేయడంతో ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో తగ్గింది. మంగళవారం ప్రాజెక్ట్‌లోకి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1091అడుగుల(80.501టీఎంసీలు)నీటి నిల్వ ఉంది. కాకతీయ కాలువకు నాలుగువేలు, లక్ష్మీకాలువకు 150, మిషన్‌భగీరథకు 231, వరదకాలువకు నాలుగువేలు, సరస్వతీ కాలువకు 500క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.


బాబ్లీ గేట్ల మూసివేత కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

## నిజాంసాగర్‌లో నూతన రైల్వేలైన్ సర్వే

నిజాంసాగర్, అక్టోబర్ 29: సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ నుంచి నిజాంసాగర్, బాన్సువాడ, నిర్మల్, ఆదిలాబాద్ మీదుగా నాగ్‌పూర్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు కోసం సర్వే పనులను మంగళవారం చేపట్టారు. నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ శివారులో నిజాంసాగర్ – నర్సింగ్ రావుపల్లి రహదారిపై మట్టి నమూనా పరిశీలన పనులు నిర్వహిస్తున్నారు. నూతన రైల్వే లైన్ నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందనున్నదని స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

## రోడ్డెక్కిన విద్యార్థులు

- ఉమ్మడి జిల్లాలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన
- స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

కామారెడ్డి, అక్టోబర్ 29 : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రోడ్డెక్కారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. కామారెడ్డి పట్టణంలో ర్యాలీ చేపట్టి, స్థానిక నిజాంసాగర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో ఏబీవీపీ కామారెడ్డి జిల్లా కన్వీనర్ రోహిత్, ఖలీల్, కార్యకర్తలు వెంకటేశ్, రాజు, నవీన్, మానస, శివ, రాకేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

**కామారెడ్డిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దీక్ష**

కామారెడ్డి, అక్టోబర్ 29 : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం దీక్ష నిర్వహించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి అజయ్, నాయకులు మణికంత, సమీర్, రాహుల్, నితిన్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు